గట్టమ్మను దర్శించుకున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

వినోద్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

ములుగురూరల్, సెప్టెంబర్ 28 : కరీంనగర్ మాజీ ఎంపీ, బీఆర్ఎస్ రాష్ట్ర సీనియర్ నాయకుడు బోయినపల్లి వినోద్‌కుమార్ శనివారం ములుగు జిల్లా కేంద్రంలోని గట్టమ్మ దేవాలయాన్ని సందర్శించి, మొక్కులు చెల్లించుకున్నారు. ములుగు పర్యటనలో భాగంగా గట్టమ్మ వద్దకు ఆయన చేరుకోగా బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ బడే నాగజ్యోతి ఆధ్వర్యంలో నాయకులు స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పాలెపు శ్రీనివాస్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గండ్రకోట సుధీర్‌యాదవ్, జగదీశ్వర్, పోరిక విజయ్‌రాంనాయక్, సానికొమ్ము రమేశ్‌రెడ్డి, వేములపల్లి భిక్షపతి, గొర్రె సమ్మయ్య, గై అశోక్, కోగిల మహేశ్, భూక్యా జంపన్న, ఆరెందుల కుమార్ పాల్గొన్నారు.

రెండు వయోవృద్ధుల కేసుల పరిష్కారం

ములుగురూరల్, సెప్టెంబర్ 28 : తల్లిదండ్రులు, సీనియర్ సిటిజన్ పోషణ సంక్షేమ ట్రిబ్యునల్‌లో రెండు కేసులను పరిష్కరించినట్లు ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి శనివారం తెలిపారు. మల్లంపల్లి గ్రామానికి చెందిన వృద్ధుడు పత్తి రాజయ్యకు ముగ్గురు కుమారులు కాగా, వారు ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తూ తన ఆస్తులను తీసుకొని పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేశాడని తెలిపారు. ఆస్తులన్నీ తిరిగి నాగిరెడ్డి పేరుపై రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని ఆయన బిడ్డలకు తెలుపడంతోపాటు పోషణ నిమిత్తం ప్రతి నెలా రూ.2వేల చొప్పున అందించాలని ట్రిబ్యునల్ ద్వారా ముగ్గురు కుమారుల నుంచి రాజయ్యకు నెలకు రూ.6వేలు చెల్లించాలని ఆదేశించినట్లు తెలిపారు. అలాగే, అదే గ్రామానికి చెందిన మరో వృద్ధుడు డాకూరి నాగిరెడ్డి తన ఇద్దరు కుమార్తెలు పింగిలి మౌనిక, పెద్దిరెడ్డి సంధ్య ఆస్తులు తీసుకొని వృద్ధాప్యంలో తనను పట్టించుకోవడం లేదని ఫిర్యాదు చేశాడని తెలిపారు. ఆస్తులన్నీ తిరిగి నాగిరెడ్డి పేరుపై రిజిస్ట్రేషన్ చేసి ఇవ్వాలని ఆయన బిడ్డలకు తెలుపడంతోపాటు పోషణ నిమిత్తం ప్రతి నెలా రూ.2వేల చొప్పున అందించాలని ట్రిబ్యునల్ ద్వారా తీర్పు వెలువరించినట్లు ఆర్డీవో తెలిపారు.

తల్లుల చెంత నిలువనీడ కరువు

- అవస్థలు పడుతున్న భక్తులు
- అందుబాటులో లేని దేవాదాయశాఖ అధికారులు

భక్తులకు ఎలాంటి రక్షణ లేకుండా అమ్మవార్ల గద్దెల ప్రాంగణం

తాడ్వాయి, సెప్టెంబర్ 28 : వనదేవతలు మేడారం సమ్మక్క, సారలమ్మల చెంత భక్తులకు నిలువనీడ కరువైంది. భక్తులు అవస్థలు చెప్పుకుందామంటే ఒక్క అధికారి కూడా అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతూనే అమ్మవార్లను దర్శించుకోవాల్సి వస్తుంది. వారం రోజులుగా విపరీతంగా ఎండలు కాస్తుండడంతో తల్లుల గద్దెల ప్రాంగణంలోని గ్రానైట్ రాళ్లు వేడెక్కి భక్తులను పరుగులు తీయిస్తున్నాయి. ఎండ నుంచి రక్షణగా భక్తులకు ఎలాంటి ఏర్పాటు చేయకపోవడంతో గద్దెల వరకు వచ్చిన వృద్ధులు దూరం నుంచే దర్శనం చేసుకుంటూ దేవాదాయశాఖ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మేడారం కార్యాలయంలో ఆరుగురు జూనియర్ అసిస్టెంట్లు ఉండగా శనివారం ఒక్కరు మాత్రమే విధుల్లో ఉన్నారు. మిగతా వారు ఆఫీస్ పనిమీద వరంగల్‌లోనే ఉన్నట్లు చెబుతున్నారు. అందరూ వరంగల్‌లోనే ఉంటూ రోజుకు ఇద్దరు చొప్పున విధులు నిర్వహిస్తున్నట్లు సమాచారం. ఈవో కూడా మేడారానికి రాకపోవడంతో భక్తులకు కనీస సౌకర్యాలు అందక ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి, ఎండ వానల నుంచి రక్షణ కల్పించి, తాగునీటి సమస్యనుతీర్చాలని కోరుతున్నారు.

నిర్లక్ష్యపు కోరల్లో భూపాలపల్లి ఆర్టీసీ డిపో

- పది రోజులుగా ఇన్‌చార్జిగా పరకాల డీఎం
- ఎంఎఫ్, సీఐ, ఎస్‌టీఐ పోస్టులు ఖాళీ
- డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ ట్రాఫిక్ అధికారే దిక్కు
- డ్రైవర్లు, కండక్టర్ల కొరత
- ఏసీ బస్సుల తొలగింపు
- పుణ్యక్షేత్రాల బస్సులు రద్దు
- డిపోపై కొరవడిన అజమాయిషీ

భూపాలపల్లి ఆర్టీసీ డిపో

జయశంకర్ భూపాలపల్లి, సెప్టెంబర్ 28(నమస్తే తెలంగాణ) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపోపై ప్రభుత్వం, ఉన్నతాధికారులు నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారు. భూపాలపల్లి జిల్లా కేంద్రం సింగరేణి కాలరీస్ కంపెనీ, జెన్‌కో విద్యుత్ కేంద్రాలతో పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చెందుతోంది. భూపాలపల్లి డిపో బస్సుల ద్వారా రోజుకు 36వేల మంది ప్రయాణం చేస్తున్నారు. కాగా, ప్రస్తుతం డిపోపై నిర్లక్ష్యపు నీడలు అలుముకుంటున్నాయి. పరకాల డిపో మేనేజర్ రవిచంద్ర పదిరోజులకు పైగా భూపాలపల్లి డిపోకు ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. డిపోలో మెకానికల్ ఫోర్ మెన్(ఎంఎఫ్), సీఐ, ఎస్‌టీఐ పోస్టు లు ఖాళీగా ఉన్నాయి. డ్రైవర్లు, కండక్టర్ల కొరత వేధిస్తున్నది. డిపోలో ఉన్న రెండు ఏసీ బస్సులను తొలగించారు. నెల్లూరు, తిరుపతి, వేములవాడ, పుట్టపర్తి, తదితర పుణ్యక్షేత్రాలకు నడిచే బస్సులను రద్దు చేశారు. భూపాలపల్లి డిపోపై పూర్తి స్థాయిలో అధికారుల అజమాయిషీ కొరవడింది. డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ ట్రాఫిక్ జీఆర్ రెడ్డి అన్నీ తానై డిపోను ముందుకు నడిపిస్తున్నాడు.

పెరగని బస్సులు.. తగ్గిన ఆదాయం

భూపాలపల్లి ఆర్టీసీ డిపోలో ప్రస్తుతం 83 బస్సులు ప్రజలకు సేవలందిస్తున్నాయి. ఇందులో 24 అద్దె బస్సులున్నాయి. డిపోలో ఏసీ బస్సులు కరువయ్యాయి. గతంలో ఉన్న ఏసీ బస్సులను అధికారులు ఇతర డిపోలకు పంపించారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న భూపాలపల్లి ఏరియాలోని డిపోలో ఏసీ బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. 2013 నవంబర్ 22న భూపాలపల్లి ఆర్టీసీ డిపో తొమ్మిది బస్సులతో ప్రారంభం కాగా, నేడు 83 బస్సులకు చేరింది. గతంలో రోజుకు రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షల ఆదాయం వచ్చేది. ప్రస్తుతం మహాలక్ష్మి పథకంతో రోజుకు సుమారు రూ.9 లక్షల ఆదాయం వస్తుంది. 331 మంది ఉద్యోగులు డిపోలో పనిచేస్తున్నారు. డిపోలో ఎంఎఫ్, సీఐ, ఎస్‌టీఐ పోస్టులతో పాటు డిపో మేనేజర్ పోస్టు ఖాళీగా ఉంది. పరకాల డీఎం ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు.

ఏదీ అజమాయిషీ?

భూపాలపల్లి ఆర్టీసీ డిపోపై అధికారుల అజమాయిషీ కొరవడింది. కొంతకాలంగా డిపోలో ఉన్నతాధికారులు వివాదాస్పదంగా మారుతున్నారు. గతంలో ఒక అధికారిణి డిపోలో వివాదాస్పదంగా మారడంతో ఇతర డిపోకు బదిలీ చేశారు. అలాగే, మరో అధికారి డిపో ఉద్యోగుల ఆగ్రహానికి గురై వెళ్లిపోయారు. డిపో ఏర్పడిన తర్వాత 2013లో మొదటగా జగన్ డీఎంగా రెండేళ్లు, అనంతరం రఘు మూడేళ్లు, లక్ష్మీధర్మ మూడేళ్లు, భూక్యా ధరం సింగ్ ఏడాది కొనసాగారు. అనంతరం వచ్చిన రాజన్ ఆరు నెలలు, ప్రతిమారెడ్డి తొమ్మిది నెలలు, లక్ష్మీరాజం తొమ్మిది నెలలు మాత్రమే డిపో మేనేజర్‌గా కొనసాగారు. ఇటీవల డిపోలో అధికారులు, ఉద్యోగుల మధ్య సత్సంబంధాలు కొరవడి ఉన్నతాధికారులకు ఫిర్యాదులు వెళ్లడం, అధికారులపై వేటు పడడం పరిపాటిగా మారింది. ఈ క్రమంలో డిపోలో ప్రశాంత వాతావరణం దెబ్బతిన్నది.

కాళేశ్వరంలో పీఠాధిపతి పూజలు

కాళేశ్వరం, సెప్టెంబర్ 28 : శ్రీ కాళేశ్వర ముక్తీశ్వరస్వామి వారి ఆలయాన్ని గన్నవరం భువనేశ్వరి పీఠాధిపతులు కమలానంద భారతి స్వామి శనివారం దర్శించుకున్నారు. వీరు ఆలయం వద్దకు రాగా వారికి అర్చకులు, వేద పండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామి వారికి అభిషేకం చేశారు. అమ్మవారి ఆలయంలో భక్తులకు ఆశీర్వచనాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్, కాళేశ్వరం గ్రామస్తులు, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్రం జాషువా జయంతి

ములుగురూరల్/కాటారం, సెప్టెంబర్28 : ములుగు జిల్లా కేంద్రంలో కుల వివక్ష పోరాట సమితి ఆధ్వర్యంలో గుర్రం జాషువా జయంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రభుత్వ దవాఖానలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. మండల కార్యదర్శి జన్ను దేవేందర్, నాయకులు నిరంజన్, వసంత్, భిక్షపతి పాల్గొన్నారు. అలాగే, కాటారం మండలం ధన్వాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జయశంకర్ సారస్వత సమితి ఆధ్వర్యంలో గుర్రం జాషువా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చినాల శ్రీనివాస్, వేముల శరత్ బాబు, గడ్డం లక్ష్మయ్య, పర్వీన్, పించగిరి సంధ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

దాడికి నిరసనగా ఫారెస్టు అధికారుల ర్యాలీ

ర్యాలీ నిర్వహిస్తున్న ఫారెస్టు అధికారులు

ములుగురూరల్, సెప్టెంబర్ 28 : తాడ్వాయి మండలం దామెరవాయిలో ఫారెస్టు అధికారులపై జరిగిన దాడికి నిరసనగా ములుగు జిల్లా కేంద్రంలో శనివారం జిల్లాలోని ఫారెస్టు అధికారులు, సిబ్బంది ఫారెస్టు కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. దాడికి వ్యతిరేకం గా నినాదాలు చేశారు. కలెక్టర్ టీఎస్ దివాకరను కలిసి ఫిర్యాదు చేశారు. అ క్కడి నుండి ఎస్పీ కార్యాలయానికి చేరుకొని ఎస్పీ డాక్టర్ పీ శబరీష్‌ను కలిశారు. ఫారెస్టు అధికారులు, సిబ్బందిపై దాడులు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ర్యాలీలో ఎఫ్ఆర్వోలు, బీట్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అటవీశాఖ అధికారులకు రక్షణ కల్పించాలి

వాజేడు : వలస గిరిజనేతరుల దాడుల నుంచి అటవీశాఖ అధికారులకు రక్షణ కల్పించాలని ఆదివాసీ నవనిర్మాణసేన మండల అధ్యక్షుడు మొడెం నాగరాజు డిమాండ్ చేశారు. మండలంలోని ఇప్పగూడెం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తాడ్వాయి మండలంలో అటవీశాఖ అధికారులపై చేసిన దాడిని తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో కోర్స సంపత్, చందు, శివ, రాజేందర్ పాల్గొన్నారు.

గోదాముల తనిఖీ

వెంకటాపురం(నూగూరు), సెప్టెంబర్ 28 : మండలకేంద్రంలోని జీసీసీ, ఎంఎల్ఎస్ స్టాక్ గోదాములను కలెక్టర్, సివిల్ సప్లయ్ అధికారుల ఆదేశాల మేరకు శనివారం తహసీల్దార్ లక్ష్మీరాజయ్య తనిఖీ చేశారు. స్టాక్ పాయింట్ రికార్డులు, రిజిస్టర్లను పరిశీలించారు. గోదాములోని బస్తాల వివరాలు, సప్లయ్ అవుతున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. తనిఖీ నివేదికను జిల్లా అధికారులకు పంపించనున్నట్లు తెలిపారు.

డీపీఎల్-9 మెగా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

కాటారం, సెప్టెంబర్ 28 : మండలంలోని ధన్వాడలో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీపాద స్మారక డీపీఎల్-9 మెగా క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సోదరుడు, శ్రీపాద ట్రస్ట్ చైర్మన్ శ్రీను బాబు ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకొని టీషర్టులను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు చీమల సందీప్, నాయకులు దేవేందర్ రెడ్డి, మహేశ్వరి, అశోక్, రమేష్, కరుణాకర్ రావు, సత్తిరెడ్డి, ఊమ్ సింగ్, తిరుపతి రెడ్డి, రవీందర్ రావు, రవి, మహేశ్ పాల్గొన్నారు.

ఎడపల్లిలో కొనసాగుతున్న జియోలాజికల్ పరీక్షలు

మహదేవపూర్,సెప్టెంబర్ 28 : మండల పరిధిలోని ఎడపల్లిలో మినిస్ట్రీ ఆఫ్ మైన్స్ ఆధ్వర్యంలో చేపట్టిన జియోలాజికల్ సర్వే పనులు కొనసాగుతున్నాయి. శనివారం సర్వే నిపుణుల బృందం భూమి పొరల్లో ఏర్పడే మార్పులు, నీటి లభ్యతపై అంచనా పరీక్షలు చేశారు. సుమారు 5 వేల మీటర్ల లోతు ప్రత్యేక యంత్రాల సాయంతో మట్టి పొరల్లో డ్రిల్లింగ్ చేసి, నమూనాలు సేకరించారు. ఈ జియోలాజికల్ పరీక్షలు పదేళ్లకోసారి చేస్తామని ఆ సంస్థ ప్రతినిధులు వెల్లడించారు. ఇక్కడ పూర్తయిన తర్వాత బొమ్మాపూర్ గ్రామంలో పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు.

బొగ్గుల వాగు ప్రాజెక్టులో నీటిని నింపాలి

భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ

బొగ్గులవాగు ప్రాజెక్టును పరిశీలిస్తున్న కలెక్టర్

మల్హర్, సెప్టెంబర్ 28 : చిన్న కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా బొగ్గుల వాగు ప్రాజెక్టులో నీటిని నింపేందుకు సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. శనివారం మల్హర్ మండలంలో ఆయన విస్తృతంగా పర్యటించారు. పాత రుద్రారం ఊర చెరువు విస్తరణ పనులను పరిశీలించారు. ఊర చెరువు నుంచి బొగ్గుల వాగు ప్రాజెక్టుకు అనుసంధానం చేస్తూ నీటిని తరలించేందుకు ఇరిగేషన్, అటవీ, రెవెన్యూ అధికారులతో కలిసి బొగ్గుల వాగు ప్రాజెక్టును సందర్శించారు. కలెక్టర్ మాట్లాడుతూ చిన్న కాళేశ్వరం నుంచి రుద్రారం ఊర చెరువుకు, ఇక్కడి నుంచి బొగ్గుల వాగు ప్రాజెక్టుకు నీటిని తరలించేందుకు కాలువలు, ఎత్తిపోతలపై అధికారులు సర్వే చేపట్టి ప్రతిపాదనలు పంపించాలన్నారు. అనంతరం తాడిచెర్ల ఓసీపీ గనిని పరిశీలించారు. ఓసీపీ నుంచి గణపురం మండలం చెల్పూరు కేటీపీపీకి బొగ్గును తరలించేందుకు ఏర్పాటు చేయబోయే కన్వేయర్ బెల్టు గురించి జెన్‌కో అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తాడిచెర్లలో సీపీ నుంచి చెల్పూరు కేటీపీపీకి ప్రస్తుతం 68 కి.మీ దూరం ఉంటుందని కన్వేయర్ బెల్టు ఏర్పాటు చేయడంతో 17.2 కి.మీ దూరం మాత్రమే వచ్చి, రవాణా భారం తగ్గుతుందన్నారు. అంతకుముందు తాడిచెర్ల ఎస్సీ కాలనీ ఆర్‌అండ్ ఆర్ స్థలాన్ని పరిశీలించారు. తర్వాత ప్రభుత్వ జూనియర్ కళాశాల, జడ్పీ పాఠశాలను తనిఖీ చేశారు. కళాశాలలో మరమ్మతు పనులకు ప్రతిపాదనలు పంపించాలన్నారు. కార్యక్రమంలో థర్మల్ డైరెక్టర్ లక్ష్మయ్య, సీఈ సిద్ధయ్య, తహసీల్దార్ రవికుమార్ పాల్గొన్నారు.

కోర్టు భవన సముదాయాలను తరలించొద్దు

బీఆర్ఎస్ మాజీ కౌన్సిలర్ రేగుల రాకేశ్

నిరసన వ్యక్తం చేస్తున్న రాకేశ్, కాలనీవాసులు

కృష్ణ కాలనీ, సెప్టెంబర్ 28: భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కోర్టు భవన సముదాయాలను ఇతర ప్రాంతాలకు తరలించవద్దని బీఆర్ఎస్ పార్టీ మాజీ కౌన్సిలర్ రేగుల రాకేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో కోర్టుకు కేటాయించిన స్థలంలోనే భవన సముదాయాలను నిర్మించాలని డిమాండ్ చేస్తూ శనివారం కారల్ మార్క్స్ కాలనీ, యాదవకాలనీ ప్రజలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రేగుల రాకేశ్ మాట్లాడుతూ పరిపాలనా సౌలభ్యం కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం భూపాలపల్లిని జిల్లాగా ఏర్పాటు చేసిందన్నారు. దీనిలో భాగంగానే ఇక్కడ జిల్లా కార్యాలయాల తోపాటు కోర్టు, సబ్‌కోర్టు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులు మంజూరు కాగా, వాటి నిర్మాణం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లా కేంద్రంలోని కారల్ మార్క్స్ కాలనీ సమీపంలో గల సింగరేణి పాఠశాల ఎదుట 11ఎకరాల 20 గుంటల భూమిని కేటాయించిందని తెలిపారు. ఏడాది క్రితమే ఆ స్థలాన్ని కోర్టుకు అప్పగించిందన్నారు. అయితే, ప్రస్తుతం కొంత మంది ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు కోర్టును గణపురం మండలంలోని మైలారం గ్రామానికి తరలించేందుకు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. పట్టణంలోనే కోర్టు ఏర్పాటు చేస్తే జిల్లాల్లోని అన్ని ప్రాంతాల కక్షిదారులకు అనుకూలంగా, ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఇప్పటికైనా కోర్టు తరలింపును మానుకోవాలన్నారు. లేకపోతే పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తానమని, అవసరమైతే ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని హెచ్చరించారు. కాగా, కారల్ మార్క్స్ కాలనీలో నిర్మించిన సెల్ టవర్‌ను తొలగించాలని రేగుల రాకేశ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సెల్ టవర్ ఎదుట కాలనీవాలసుతో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో కారల్ మార్క్స్ కాలనీ, యాదవ కాలనీవాసులు మెండు దేవేందర్, చింతల నర్సయ్య, తుమ్మల స్వామి, పూనం ప్రకాశ్, శ్రీనివాస్, చింతల లత, నవీన్, ఇటుకల శంకర్, రాధ, లక్ష్మి, కొమురయ్య పాల్గొన్నారు.

నూతన థర్మల్ ప్లాంట్లను నెలకొల్పాలి

గణపురం,సెప్టెంబర్ 28 : రాష్ట్రంలోని రామగుండం థర్మల్ ప్లాంటుతో పాటు నూతన పవర్ ప్లాంట్ నిర్మాణాలను టీజీజెన్కో ఆధ్వర్యంలోనే నెలకొల్పాలని, ఎట్టి పరిస్థితుల్లో సింగరేణి భాగస్వామ్యాన్ని అంగీకరించేది లేదని తెలంగాణ స్టేట్ పవర్ ఇంజినీర్స్ అసోసియేషన్, తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ అసోసియేషన్ నాయకులు తెలిపారు. శనివారం మండలంలోని చెల్పూర్ కేటీపీపీ ప్రధాన గేటు ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా గృహ, వాణిజ్య వినియోగదారులు, రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడానికి ఇంజినీర్లు, విద్యుత్ సిబ్బంది ఎల్లవేళలా శ్రమిస్తున్నారన్నారు. టీజీ జెన్కో, సింగరేణి ఆధ్వర్యంలో జాయింట్ వెంచర్‌గా మెగావాట్ల ప్లాంట్ నిర్మించాలని తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకూ నిరసన కార్యక్రమాలు దశలవారీగా కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఇంజినీర్లు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

టీజీఎండీసీ పీఎంగా శ్రీరాములు

మహదేవపూర్, సెప్టెంబర్ 28 : మహదేవపూర్ మండల టీజీఎండీసీ నూతన ప్రాజెక్ట్ మేనేజర్‌గా శ్రీరాములు నియమితులయ్యారు. గతంలో ఇక్కడ పీవో విధులు నిర్వర్తించిన తారక్‌నాథ్‌రెడ్డి బదిలీపై హైదరాబాద్ కార్యాలయానికి వెళ్లగా, ఆయన స్థానంలో శ్రీరాములు బదిలీపై వచ్చారు. మహదేవపూర్, కాటారం, మల్హర్, మంచిర్యాల జిల్లా కొల్లూర్ ఇసుక క్వారీలను పర్యవేక్షించనున్నారు.

తెలంగాణ రాష్ట్ర పోలీస్ యోగా టీంతో మధు

ఆలిండియా పోలీస్ యోగా చాంపియన్‌షిప్‌నకు కోచ్‌గా జిల్లా పోలీసు

కాటారం, సెప్టెంబర్ 28 : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరుగుతున్న ఆలిండియా పోలీస్ గేమ్స్‌లో తెలంగాణ యోగా టీం కోచ్‌గా భూపాలపల్లి జిల్లాకు చెందిన పోలీస్ ఎడ్ల మధు వ్యవహరించగా, ఆయన పర్యవేక్షణలో తెలంగాణ పోలీస్ టీం బ్రాంజ్ మెడల్ సాధించింది. మల్హర్ మండలం కొయ్యూరు నుంచి 2011లో ఉమ్మడి ఏపీ పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో కరీంనగర్ సివిల్ పీసీగా చేరిన ఆయన భూపాలపల్లి జిల్లాలోనే విధులు నిర్వర్తిస్తూ వస్తున్నారు. ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు అందుకుంటూ ఎన్నో రివార్డులు సొంతం చేసుకున్నారు. 2022లో ప్రతిష్టాత్మకమైన తెలంగాణ రాష్ట్ర పోలీస్ కఠిన సేవా పథకం అందుకున్నారు. ప్రస్తుతం కాటారం డీఎస్పీ కార్యాలయంలో క్రైమ్ రైటర్‌గా పనిచేస్తున్న మధు యోగాలో ప్రావీణ్యంతో 2017లో జరిగిన తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో రెండు బంగారు పతకాలు, రెండు రజత పతకాలు సాధించాడు. 2017లో జార్ఖండ్‌లో జరిగిన ఆలిండియా పోలీస్ స్పోర్ట్స్‌లో తెలంగాణ పోలీస్ టీం తరపున పాల్గొన్నాడు. 2018లో ముంబైలో జరిగిన సౌత్ ఏషియన్ యోగా చాంపియన్ షిప్‌లో గోల్డ్ మెడల్, సిల్వర్ మెడల్ సాధించి, 2019లో రాజస్థాన్ రాష్ట్రం జైపూర్‌లో జరిగిన నేషనల్ యోగా చాంపియన్ షిప్‌లో కూడా తెలంగాణ రాష్ట్ర యోగా టీం తరపున ప్రాతినిధ్యం వహించారు. 2022లో పంజాబ్ రాష్ట్రం జలంధర్‌లో జరిగిన ఆలిండియా పోటీలలో తెలంగాణ యోగా టీం కోచ్‌గా వ్యవహరించి, ఒక గోల్డ్‌మెడల్, సిల్వర్ మెడల్ దక్కేలా చేశారు. 2023లో రాజస్థాన్‌లోని ఉదయ్ పూర్‌లో జరిగిన జాతీయ స్థాయి యోగా పోటీలలో మన రాష్ట్రం టీం ఒక సిల్వర్ మెడల్, రెండు బ్రాంజ్‌మెడల్స్ సాధించేలా కృషి చేశారు. అంతేగాక ఈ ఏడాది ఫిబ్రవరిలో మహారాష్ట్ర నాగపూర్‌లో జరిగిన ఆలిండియా ఇండియా పోలీస్ గేమ్స్‌లో కూడా రాష్ట్ర యోగా టీం ఒక సిల్వర్ మెడల్, బ్రాంజ్‌మెడల్ సాధించేలా చేశారు. ఈ మేరకు ఆయనను పోలీస్ అధికారులు అభినందిస్తున్నారు.

రేపు రామప్పలో వేలంపాట

వెంకటాపూర్, సెప్టెంబర్ 28 : మండలంలోని రామప్ప దేవస్థానం ఆవరణలో కొబ్బరి ముక్కలు పోగుచేసుకోవడానికి సోమవారం మధ్యాహ్నం వేలం పాట నిర్వహించనున్నట్లు ఈవో బిల్ల శ్రీనివాస్ తెలిపారు. ఏడాది పాటు కొబ్బరిముక్కలు పోగోచేసుకోనుటకు రూ.20 వేల డిపాజిట్ చెల్లించి పాటలో పాల్గొనాలని సూచించారు. వివరాలకు 96401 31263, 91827 58590, 93472 41990 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

దేశ రక్షణకు యువత ముందుండాలి

చిట్యాల, సెప్టెంబర్ 28 : దేశ రక్షణకు యువత ముందుకు రావాలని ఎయిర్ ఫోర్స్ అఫీషియల్ కార్పొరల్ ఎన్ సందీప్ పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ శ్రీదేవి అధ్యక్షతన విద్యార్థులకు అగ్నిపత్ పథకంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు అగ్నిపత్ పథకంలో చేరే పరీక్షలపై అవగాహన కలిపించి, మౌఖిక పరీక్షలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ యుగంధర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ నీటి సరఫరాపై శిక్షణ

కాటారం/వెంకటాపురం(నూగూరు), సెప్టెంబర్ 28 : కాటారం మండలకేంద్రంలోని రైతు వేదికతోపాటు వెంకటాపురం(నూగూరు) ఎంపీడీవో కార్యాలయంలో మిషన్ భగీరథ నీటి సరఫరాపై ఆయా గ్రామ పంచాయతీల సహాయకులకు శనివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్లంబింగ్, నీటి నాణ్యత పరిశీలన ఇతర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి సంజీవరావు, ఎంపీడీవో బాబు, ఎంపీవో వీరస్వామి, మిషన్ భగీరథ డీఈ రమేశ్, ఏఈలు రాజశేఖర్, కల్యాణ్, మిషన్ భగీరథ ఇంట్రా ఈఈ సుభాశ్, డీఈ వెంకటేశ్, ఏఈ శ్రీనివాస్, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, ఏంపీవో హనుమంతరావు పాల్గొన్నారు.

వివేకనందుడి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, అధికారులు

యువత దేశ ఔన్నత్యాన్ని కాపాడాలి

ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర

ములుగురూరల్, సెప్టెంబర్ 28 : యువత దేశ ఔన్నత్యాన్ని కాపాడాలని ములుగు కలెక్టర్ టీఎస్ దివాకర అన్నారు. శనివారం గిరిజన భవనంలో క్రీడాశాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి యువజనోత్సవాలు, సైన్స్‌మేళా, యువజన కళాకారుల ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి స్వామి వివేకనంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, మాట్లాడారు. యువతలో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు యువజనోత్సవాలు ఎంతగానో దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంపత్‌రావు, జిల్లా యువజన క్రీడల అధికారి తుల రవి, బీసీ అభివృద్ధిశాఖ అధికారి రవీందర్‌రెడ్డి, డీపీఆర్‌వో రఫిక్, సైన్స్ అధిక